BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 3, March 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# ఓల్గా రాజకీయ కథలు - స్త్రీవాదం

- డా॥. కె. సుజాత, అధ్యాపకురాలు, తెలుగు విభాగం, పి.ఆర్.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కందుకూరు.

ఓల్గా రాసిన రాజకీయ కథలు పరిపూర్ణంగా స్త్రీవాదం ప్రతిఫలించిన కథలు. పేరు వినగానే ఈ కథలు రాజకీయానికి సంబంధించిన కథలు అనుకుంటాము. కానీ ఇవి రాజకీయానికి సంబంధించిన కథలు కావు. స్త్రీలపై తరతరాలుగా జరిగిన రాజకీయ, సామాజిక కుట్రలను బట్టబయలు చేసిన కథలు. సీత జడ, కళ్ళు, ముక్కుపుడక, రాతి గుండెలు, నోర్ముయ్ మొదలగు కథలన్నీ స్త్రీల శరీరాల చుట్టూ అల్లబడిన భావజాలం. సమాజం స్త్రీల విషయంలో చేసిన కుట్రలను, కుళ్ళును బహిర్గతం చేస్తాయి. స్త్రీలను స్త్రీలుగా తయారు చేయడానికి ఎంత పకడ్బందీగా జండర్ విధానం సమాజంలో తయారయిందో తెలిపే కథలే ఈ రాజకీయ కథలు.

**సీతజడ :**

సీతజడ అనే కథలో స్త్రీల జుట్టు విషయంలో సమాజం విధించే ఆంక్షల గురించి చెప్తూ ఒక స్త్రీ, జుట్టు పెంచాలా వద్దా అనే విషయాన్ని నిర్ణయించేది సాంఘికశక్తులేనని చెప్తారు రచయిత్రి. సీత అనే అమ్మాయికి పొడుగాటి పట్టుకుచ్చులాంటి అందమైన జుట్టు ఉండేది. సీత పదో తరగతికి వచ్చేసరికి  రెండు జడలమీద ఇంట్లో తీవ్ర వ్యతిరేకత మొదలయింది. సీతకి ముప్పయ్యేళ్ళ వయసప్పుడు భర్త మరణిస్తే వాళ్ళ నాయనమ్మ జుట్టు తీసేయాలని పెద్ద యుద్ధమే చేసింది. సీత అన్నలు అందుకు ఒప్పుకోకపోవడంతో సీతకి జుట్టు మిగిలింది, కానీ దాని పోషణ పూర్తిగా పోయింది. సీత జడకి నూనె పెట్టుకోవడం కూడా ఆమె వదినలు సహించేవారు కాదు. ఇంకెన్నాళ్ళు వాలుజడ వయ్యారం, ముడేసుకోరాదూ అని నిష్ఠురమాడేవారు. చిన్నతనంలో సీత పెద్ద జడతో విసిగిపోయి గుండు చేయించుకోవాలనుకుంటే తల్లి ఒప్పుకోదు. స్త్రీల జడ విషయంలో ఇంతమంది పెత్తనాలు, నియమాలు, ఆంక్షలు ఎందుకొచ్చాయి? ఆడదాని జుట్టునింత గట్టిగా పట్టుకున్న సమాజం ఆడదాన్ని ఇంకెంత గట్టిగా పట్టుకుంటుంది అని ప్రశ్నిస్తారు రచయిత్రి ఈ కథ ద్వారా.

**కళ్ళు :**

ఆడవాళ్ళకి కళ్ళున్నా చాలా విషయాలు చూడలేరని ఈ సమాజం చూడనివ్వదని తెలియచేసిన కథ కళ్ళు అనే కథ. వీధిలో నడిచేటప్పుడు 'అలా దిక్కులు చూస్తావేం, తలొంచుకు నడువు, నేలమీద చూడు' అని మొట్టికాయలు వేస్తుంది తల్లి. ఆడవాళ్ళు కొన్నిటిని మాత్రమే చూస్తే చాలని జీర్ణించుకుపోయిన తల్లి ఆమె. ఆడవాళ్ళ కళ్ళ వెంట నీళ్ళు ఊరికూరకే రావాలని నమ్మే ఆమె 'రాతిగుండె కంటి వెంట చుక్కనీరు రాలేదు' అని పక్కింటామెని తిడుతుంది. చాలా విషయాలను కళ్ళు మూసుకుని, నోరు మూసుకుని చూసీ చూడనట్లుగా ఉండేవిధంగా ఆడవాళ్ళను తయారు చేసిన సమాజం కుట్రను ఈ కథలో బహిర్గతం చేశారు రచయిత్రి.

**రాతిగుండెలు :**

బ్రెస్ట్‌కాన్సర్ పేషెంటు సుశీల బాధపడవద్దని తనను ఓదార్చుతున్న డాక్టర్ హేమతో 'డాక్టర్ మీకు తెలుసా నేను ఎన్నోసార్లు నా రొమ్ములను కత్తిరించుకోవాలనుకున్నాను. బహుశా అందుకే నాకీ కాన్సర్ వచ్చిందేమో'. అని అడుగుతూ మీ గుండెలమీద మీకెప్పుడూకోపం రాదా అని ప్రశ్నిస్తుంది. ఆమె అలా ప్రశ్నించడం వెనుక ఆమె పడిన ఆవేదన అర్థం అవుతుంది. అలా అడగడం సమాజంలోని ఒకానొక నీచప్రవృత్తిని కొరడాతో చెళ్ళున కొట్టినట్లనిపిస్తుంది. డాక్టర్ హేమతో తన మనోభావాలు పంచుకుంటూ చిన్నప్పటినుండి తనకెదురైన చేదు